క్లుప్తంగా

బాచుపల్లి-కొత్తగూడ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



రోడ్డు విస్తరణ పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కందుకూరు: మండలాభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానని ఎంపీపీ మంద జ్యోతిపాండు, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక సర్పంచ్ శ్రీశైలం ఆధ్వర్యంలో మంత్రి సబితారెడ్డి మంజూరు చేసిన డీఎంఎఫ్ నిధులు రూ.8 లక్షలతో మండలంలోని బాచుపల్లి నుంచి పెరుగుగూడ మీదుగా కొత్తగూడను కలిపే రహదారి విస్తరణ పనులను వారు ప్రారంభించారు. అభివృద్ధి పనుల్లో అందరూ కలిసిరావాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సురేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్, డైరెక్టర్లు ఆనంద్, శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ కె.రాములు, సర్పంచ్ గోవర్ధన్, నాయకులు భూపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, దీక్షిత్‌రెడ్డి, ఇ.రాములు, ఎం.రాములు, కె.అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, కె.బాల్‌రెడ్డి, శ్రీశైలం, కె.నర్సింహా, విష్ణుమూర్తి, లింగారెడ్డి, జంగయ్య, కృష్ణ, వెంకటేష్, నర్సింహా, రాజు, నరేష్, నవీన్, అనంత్, ఆగమయ్య, కె.శ్రీశైలం, ప్రకాష్‌కుమార్, కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

కందుకూరు: మండల పరిధిలోని రాచులూరులో శ్రీశివ రామచంద్రస్వామి దేవాలయం పునఃనిర్మాణంలో భాగంగా విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను ఈనెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

శివగంగ ఆలయంలో ప్రత్యేక పూజలు



మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాజేశ్వరీ దేవి అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పలంకరణ నిర్వహించారు. శివుడికి పూలతో అభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి మొక్కులను తీర్చుకున్నారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్‌గౌడ్, ఆలయ డైరెక్టర్లు, పూజారులు పాల్గొన్నారు.

నేడు రైతు దినోత్సవ వేడుకలు

మహేశ్వరం: మండల పరిధి దుబ్బచర్ల గ్రామంలోని రైతు వేదికలో తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం రైతు దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సబితారెడ్డి, జిల్లాస్థాయి ఉన్నతాధికారులు హాజరవుతున్నారని ఆయన పేర్కొన్నారు. రైతులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ, పీఏసీఎస్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బీఆర్ఎస్ మహేశ్వరం ఆర్గనైజింగ్ సెక్రటరీగా శేఖర్

దిల్‌సుఖ్‌నగర్: బీఆర్ఎస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన దుబ్బాక శేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ, మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్ఎస్ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. తనను ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించిన మంత్రి సబితారెడ్డికి, పార్టీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, సాజిద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

నేరాల నియంత్రణకు కంకణబద్ధులు కావాలి

హస్తినాపురం: నేరాల నియంత్రణకు ప్రతి ఒక్క పోలీసు కంకణబద్ధులు కావాలని, తమ విధులను సక్రమంగా నిర్వహించి ప్రజల మన్ననలను పొందాలని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ దేప జలేంధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హెడ్‌కానిస్టేబుల్ నుంచి ఏఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన పి.శ్రీనివాస్, ఎం.వేణుగోపాల్, వి.సురేందర్‌రెడ్డి, ఏఎం ప్రసాద్‌లను సీఐ అభినందించారు. శాంతిభద్రతల పరిరక్షణకు రాజీలేకుండా పని చేయాలన్నారు. అనంతరం వారిని సీఐ తోపాటు డీఐ వెంకట్, ఎస్‌ఐలు ఘనంగా సన్మానించారు.



కందుకూరు: కొత్తగూడలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ మల్లారెడ్డి



కందుకూరు: వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు



కందుకూరు: గాంధీభవన్‌లో జరిగి వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు



మీర్‌పేట: జాతీయ గీతాలాపన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తీగల, సిబ్బంది

అట్టహాసంగా దశాబ్ది సంబురం

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలో ఘనంగా నిర్వహించారు. పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు వేడుకల్లో పాల్గొన్నారు. ప్రతి ప్రభుత్వ, రాజకీయ పార్టీల కార్యాలయాపై జాతీయ జెండాను ఎగురవేశారు. స్వరాష్ట్ర సాధన కోసం త్యాగాలు చేసిన అమరవీరులను స్మరించుకున్నారు. పలుచోట్ల పండ్ల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. అమరవీరుల చిత్రపటాలు, స్తూపాలకు నివాళులర్పించారు.

– సాక్షి, నెట్‌వర్క్



బడంగ్‌పేట్: వేడుకల్లో మేయర్ పారిజాత, కాంగ్రెస్ నాయకులు



కందుకూరు: సోనియా చిత్రపటానికి క్షీరాభిషేకం



తుక్కుగూడ: వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు



మీర్‌పేట: నివాళి అర్పిస్తున్న మేయర్ దుర్గ, నాయకులు



తుక్కుగూడ మున్సిపల్ కార్యాలయంలో...



మహేశ్వరం: కాంగ్రెస్ నేత దేప భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో..



బడంగ్‌పేట్: బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో..



మహేశ్వరం మండల పరిషత్ కార్యాలయంలో..



పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో..

సరూర్‌నగర్ అభివృద్ధికి కృషి



స్ఫూర్తి మహిళా మండలి భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితారెడ్డి

- మంత్రి సబితారెడ్డి
- మహిళా మండలి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధిలో అభివృద్ధికి బాటలు వేస్తూ సుమారు రూ.కోటి 15 లక్షల నిధులతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి శ్రీకారం చుట్టారు. కాలనీల ప్రతినిధులతో కలిసి శుక్రవారం సాయంత్రం హుడాకాలనీ స్ఫూర్తి మహిళా మండలి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన, హుడాకాలనీ భారతి కాంప్లెక్ వద్ద యూజీడీ పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా కాలనీల్లో పాదయాత్ర చేస్తూ ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం సీనియర్ సిటిజన్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. నేను గెలవటం కాదు నన్ను గెలిపించిన ప్రజలు గెలవాలనేదే నా ఆశయమన్నారు. కాలనీవాసులకు అండగా ఉంటానని, ప్రతి సమస్య పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తానని.. ఇళ్లులేని పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇళ్ల స్థలాల పంపిణీ చేపడతామని తెలిపారు. దశాబద్ధి ఉత్సవాల్లో కులవృత్తుల వారిని ప్రోత్సహించేందుకు లక్ష రూపాయల చొప్పున అందించటం జరుగుతుందని వివరించారు. ఈ సందర్భంగా స్ఫూర్తి మహిళా మండలి సభ్యులు మంత్రిని సత్కరించారు.

32 ఏళ్ల కల నెరవేరింది



మహిళా మండలి భవన నిర్మాణం కోసం అధికారులను, ప్రజాప్రతినిధులను ఏళ్ల తరబడి కోరుతున్నాం. సీనియర్ సిటిజన్ ప్రాంగణంలో మహిళల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించి మహిళా భవనం కోసం శంకుస్థాపన చేసిన మంత్రికి కృతజ్ఞతలు.

– దుర్గాదేవి, స్ఫూర్తి మహిళా మండలి అధ్యక్షురాలు

సబితారెడ్డికి కృతజ్ఞతలు



మహిళల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషిచేస్తున్న మంత్రి సబితారెడ్డికి ఎల్లవేళలా అండగా ఉంటాం. స్ఫూర్తి మహిళా మండలి భవనానికి రూ.15 లక్షల నిధులు కేటాయించడం.. ఆ వెంటనే పనులు ప్రారంభించడం అభినందనీయం.

– రాజశ్రీదేవి, స్ఫూర్తి మహిళా మండలి కార్యదర్శి

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

- బీఆర్ఎస్ యువ నాయకుడు కార్తీక్‌రెడ్డి

మహేశ్వరం: యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఇంద్రారెడ్డి ట్రస్టు చైర్మన్ కార్తీక్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఉప్పుగడ్డ తండాలో బంజారా ప్రీమియర్ లీగ్-4 క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. పోటీల్లో గెలుపొందిన జట్లు, ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు కార్తీక్‌రెడ్డి నగదు బహుమతి, షీల్డులు అందజేశారు. తండాల్లో క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ ఆటల్లో ప్రావీణ్యం కలిగిన క్రీడాకారులు ఉన్నారని వారి ప్రోత్సాహానికి తమవంతు కృషి చేస్తామన్నారు. పోటీల్లో పడమటి తండా జట్టు విన్నర్‌గా, రన్నర్‌గా ఉప్పుగడ్డ తండా నిలిచాయి. విజేత జట్టుకు రూ.50వేల నగదు నాగుల్‌దోని తండా సర్పంచ్ మెగావత్ రాజునాయక్, హర్షగూడ ఉప సర్పంచ్ జాటోత్ రవినాయక్ సంయుక్తగా అందజేసి షీల్డు, రన్నర్ జట్టుకు బీఆర్ఎస్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు గోపాల్‌నాయక్ రూ.25 వేలు నగదు, షీల్డులను అందజేశారు.మహేశ్వరం జోన్ ఏసీపీ అంజయ్య, సీఐ మధుసూదన్, బీఆర్ఎస్ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కార్తీక్‌రెడ్డి

బాధిత రైతులకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: విద్యుదాఘాతంతో ఎద్దులు మృతిచెందిన సంఘటనలో రైతులకు ప్రభుత్వపరంగా అండగా ఉంటామని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ చెప్పారు. విద్యుత్ మాడ్గుల మండలం నల్లచెరువు గ్రామంలో విద్యుదాఘాతంతో గ్రామానికి చెందిన కట్ట అంజయ్యకు చెందిన ఆవు,ఎద్దు.. కట్ట పోచయ్యకు చెందిన రెండు ఎద్దులు.. కట్ట మహేశ్‌కు చెందిన రెండు ఎద్దులు.. యాదయ్యకు చెందిన ఒక ఎద్దు గురువారం మృతిచెందాయి. బాధిత రైతులను నాగర్‌కర్నూల్ జిల్లాపరిషత్ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీసింగ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ రెడ్డితో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పరామర్శించారు. అనంతరం ఒక్కో ఎద్దుకు రూ.10 వేలు చొప్పున ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, అలాగే ఒక్కో ఎద్దుకు రూ.10వేల చొప్పున ఠాకూర్ బాలాజీసింగ్ బాధిత రైతులకు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాడ్గుల ఎంపీపీ పద్మారెడ్డి, మాజీ ఎంపీపీ జైపాల్‌నాయక్, మండల టీఆర్ఎస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ రవితేజ, సర్పంచ్ జంగయ్యగౌడ్, నల్లచెరువు సర్పంచ్ మాలతి, సింగిల్ విండో చైర్మన్ తిరుమల్‌రెడ్డి, విద్యుత్ ఏడీఈ శ్రీనివాస్, సీఐ కృష్ణమోహన్, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



మృతిచెందిన ఎద్దులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆహ్లాదం @ చైతన్యహిల్స్



చైతన్యహిల్స్ కాలనీ రహదారికి ఇరువైపులా పచ్చదనం



ఇళ్ల మధ్య ఉన్న మినీ తోట

- కాలనీలో ఎటుచూసినా పచ్చదనమే
- ప్రతీ ఇంట్లో పండ్లు, కూరగాయల సాగు
- ప్రత్యేక ఆకర్షణగా మినీ తోట

మీర్‌పేట: అడుగు పెట్టగానే ఆహ్లాదం.. ఎటు చూసినా పచ్చదనమే.. వివరాల్లోకి వెళ్తే.. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని చైతన్యహిల్స్ కాలనీ పచ్చదనానికి కేరాఫ్‌గా నిలుస్తోంది. కాలనీలోని రహదారులకు ఇరువైపులా పెద్దపెద్ద చెట్లతో పాటు ప్రతి ఇంటి ఆవరణలోనూ రకరకాల మొక్కలు దర్శనమిస్తుంటాయి. కాలనీలోకి ప్రవేశించగానే పచ్చదనం, ఆహ్లాద వాతావరణం అందరినీ ఆకట్టుకుంటోంది. ప్రతి ఒక్కరూ తమ ఇంటి దాబాపై, ఆవరణలో మొక్కల పెంపకం చేపట్టి పచ్చదనానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం విశేషం.

ప్రత్యేక ఆకర్షణగా మినీ తోట..

కాలనీ అంతా పచ్చదనమే అయితే కాలనీ మధ్యలో ఉన్న మినీ తోట ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. నగరంలో కొంత ఖాళీ జాగా ఉంటే ఎవరైనా నిర్మాణం చేపట్టి వాణిజ్య, లేదా ఇతర అవసరాలకు అద్దెకు ఇచ్చి ప్రతినెలా నగదును ఆర్జిస్తుంటారు. కానీ ఇక్కడ మాత్రం ఓ కుటుంబం కమర్షియల్‌గా కాకుండా మొక్కల పెంపకంపై ఉన్న మక్కువతో తమకున్న స్థలాన్ని మినీ తోటగా మార్చేసి 15 ఏళ్లుగా పండ్లు, పూలు, కూరగాయలు, ఇతర రకాల మొక్కలను సాగు చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

సాగుచేస్తున్న మొక్కలు..

ఇక్కడి ఇళ్లతో పాటు మినీ తోటలో.. డ్రాగన్ ఫ్రూట్, దానిమ్మ, మామిడి, అరటి, సపోటా, చెరకు, పనస, మొరంగడ్డ, బత్తాయి, బొప్పాయితో పాటు గులాబీ, మల్లె, మందార, కనకాంబరం, వంకాయ, నిమ్మకాయతో పాటు ఇతర కూరగాయల మొక్కలను సాగుచేస్తున్నారు. మొక్కల సాగు, సంరక్షణ కోసం ప్రత్యేకంగా ఓ వ్యక్తి నిరంతరం అందుబాటులో ఉంటాడు. బెంగళూరు, ఢిల్లీతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి మొక్కలను తెచ్చి పెంచుతున్నామని నిర్వాహకులు తెలిపారు.



మినీ తోటలో డ్రాగన్‌ఫ్రూట్ మొక్కల సాగు